క్లుప్తంగా

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీలో రూ 1.50 కోట్లతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, వరదనీటి కాలువ పనులను మంగళవారం ఆయన సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్, ఏఈ సురేష్, నాయకులు దశరథ్, రమేష్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, శ్రీధర్, బసంత్‌తో కలిసి పరిశీలించారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

హస్తినాపురం: డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆమె ఆయా కాలనీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో కొత్త కాలనీలు వెలుస్తున్నాయని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేసేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాజుగౌడ్, మమత పాల్గొన్నారు.

బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు

సైదాబాద్: భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే బోనాల మహోత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, శ్రద్ధాబాద్ మార్కెట్ అసోషియేషన్ చైర్మన్ సుభాష్‌చందర్జీ అన్నారు. సైదాబాద్‌లో శ్రద్ధాబాద్ మార్కెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 47వ సంవత్సర మహంకాళి జాతర మహోత్సవం బ్రోచర్లను ఆయన మంగళవారం అసోషియేషన్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు.

- శ్రద్ధాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సుభాష్‌చందర్జీ, అధ్యక్షుడిగా మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కడారి రామ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సహదేవ్‌యాదవ్, కోళ్ల గోపి, జైల్‌సింగ్, గౌళికర్ దినేష్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌చందర్జీ, కోశాధికారిగా గౌళికర్ పూర్ణచందర్, కార్యదర్శులుగా ఆశీష్ గౌలీకర్, అరవింద్, సంపత్ నియమితులయ్యారు.

మా ధైర్యాన్ని కోల్పోయాం!

చందునాయక్ మృతితో సాయినగర్ హట్స్‌లో విషాదఛాయలు



ఇటీవల అగ్ని ప్రమాద బాధితులకు బియ్యం పంపిణీ కార్యక్రమంలో చందునాయక్(ఫైల్)

నాగోలు: సీపీఐ రాష్ట్ర సమితి నాయకుడు కేతావత్ చందునాయక్ మృతితో నాగోలు డివిజన్ పరిధిలోని సాయినగర్ గుడిసెల కాలనీలో విషాదఛాయలు నిండుకున్నాయి. చందునాయక్ పై కాల్పులు జరిపి హత్య చేసిన ఘటన తెలుసుకున్న గుడిసెల వాసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు, అభిమానులు, సాయినగర్ గుడిసె నివాసులు అయన మృతదేహాన్ని కడసారి చూసేందుకు ఉస్మానియా ఆసుపత్రికి తరలి వెళ్లారు. చందు నాయక్ నాగోలు సాయినగర్‌లో గుడిసెలు వేసినప్పటి నుంచి సీపీఐ పార్టీ తరుపున తమ కాలనీలో ఏ సమస్యలు ఉన్న నేనున్న అండగా ముందుండి పోరాడుతూ అందరికీ ధైర్యాన్ని ఇస్తూ సమస్యలను పరిష్కరించే వాడని తెలిపారు. సాయినగర్ గుడిసెలు రెండు దఫాలుగా అగ్ని ప్రమాదాలు సంభవించి స్థానికులు సర్వం కోల్పోయిన వారికి అండగా నిలుస్తూ ఒకవైపు ప్రభుత్వానికి అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులకు తమ గోడును విలపించి వారికి చేయూత అందించడంలో ముందు ఉన్నాడని స్థానికులు పేర్కొన్నాడు. నిత్యం పేద ప్రజలకు అండగా ఉంటూ నాయకుడు ఇప్పుడు లేడని వార్తను జీర్ణించుకోలేకపోతున్నామని గుడిసెల కాలనీ మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. ఏ సమస్య వచ్చినా మా కంటూ ఒక నాయకుడు ఉన్నాడని ధైర్యం ఉండేదని ఇకనుండి ఆ ధైర్యాన్ని కోల్పోయామని ఆవేదన చెందారు. సాయినగర్ గుడిసె వాసులకు అండగా ఉన్న నాయకుడి మొఖం చూసి కడసారిగా ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికేందుకు సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని కాలనీకి తీసుకురావాలని తగిన ఏర్పాట్లను నిర్వహిస్తూ వేచి చూశారు. చందునాయక్ మృతదేహాన్ని సాయినగర్ గుడిసెల వద్ద తీసుకురాకుండా ఉస్మానియా హాస్పిటల్ వద్ద అధికారులు రాత్రి వరకు మృతదేహాన్ని అప్పజెప్ప లేదని స్థానికులు పేర్కొన్నారు. సాయినగర్ గుడిసెల వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

3612 స్మార్ట్ రేషన్‌కార్డుల మంజూరు

మలక్‌పేట సర్కిల్–1లో పంపిణీ ఏర్పాట్లు



చాదర్‌ఘాట్: రేషన్‌కార్డుల పంపిణీకి మలక్‌పేట సర్కిల్–1 పౌర సరఫరాల శాఖ అధికారులు సిద్ధమయ్యారు. ప్రజాపాలన, మీ సేవా కేంద్రాలు, వార్డు కార్యాలయాల్లో అర్హులైన వారి నుంచి రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు తీసుకోవడంతో పాటు కొత్త పేర్లు నమోదు కూడా చేయడం జరిగింది. పౌర సరఫరాల శాఖ మలక్‌పేట సర్కిల్–1 పరిధి కిందకు వచ్చే మూసారాంబాగ్, పాత మలక్‌పేట, అజంపురా, సైదాబాద్, అక్బర్‌బాగ్, చావునీ డివిజన్ల పరిధిలో ఉన్న 82 రేషన్ దుకాణాల పరిధిలో రేషన్ కార్డుల కోసం 18602 దరఖాస్తులు రాగా 3560 మందికి అర్హులుగా తేల్చారు. పాత కార్డులో కొత్తగా పేర్లు నమోదు కోసం 19000 దరఖాస్తులు వచ్చాయి. కొత్తగా పేర్లు చేర్చిన కార్డులు 17000 మలక్‌పేట సర్కిల్–1 పరిధిలో మొదటి విడత 3612 కార్డులు ప్రింట్ కాగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఎమ్మెల్యేల చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు.

బిహార్ వాసి అదృశ్యం



చంద్రభూషణ్ ప్రసాద్

నాగోలు: పనికోసం నగరానికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బిహార్ రాష్ట్రం, జజఫర్‌పూర్‌కు చెందిన చంద్రభూషణ్ ప్రసాద్(45) లింగంపల్లిలో ఉంటూ బలరామ్‌తో కలిసి కూలీ పనులు చేసుకుంటున్నాడు. చంద్రభూషణ్ ప్రసాద్ గత కొన్ని రోజుల క్రితం కుటుంబాన్ని చూడడానికి బిహార్ వెళ్లి గత నెల 30న ఎల్‌బీనగర్‌కు వచ్చి తన బామ్మర్ది మనోహర్‌కుమార్‌కు ఫోన్‌చేసి నేను హైదరాబాద్‌కు వచ్చానని తనను తీసుకుపోవాలని చెప్పాడు. ఆ తర్వాత మరొక నంబర్‌తో ఫోన్ చేసి తాను మియాపూర్‌లో ఉన్నానని చెప్పాడు. దీంతో మనోహర్ కుమార్ అతడికి వచ్చిన ఫోన్ నెంబర్‌కు కాల్ చేయాగా తాను ఎల్‌బీనగర్ సాగర్ రింగ్ రోడ్డుకు చెందిన వ్యక్తినని ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసినట్లు చెప్పాడు. దీంతో అతను ఎల్‌బీనగర్‌కు వచ్చి అతని కోసం అన్ని ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హయత్‌నగర్- చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు బస్సులు

హయత్‌నగర్: రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం నుంచి హయత్‌నగర్ నుంచి చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు బస్సులు నడుపుతున్నామని హయత్‌నగర్ ఆర్టీసీ డిపో–1 మేనేజర్ విజయ్ ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనుల కారణంగా చాలా రైళ్లు చర్లపల్లి నుంచి నడుస్తున్నాయని, ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని చర్లపల్లికి బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. హయత్‌నగర్ నుంచి ఎల్‌బీనగర్, ఉప్పల్, నాచారం, మల్లాపూర్ మీదుగా చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుంటాయన్నారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

సైదాబాద్: పారిశుద్ధ్య కార్మికులు సహా అందరూ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఎస్‌బీఐ–ఏ కాలనీ కమ్యూనిటీహాల్లో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు సహా కాలనీవాసుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. విపత్కర సమయాల్లోనూ విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివని అన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు



ఎమ్మెల్యేను కలిసిన కాలనీవాసులు

నాగోలు: నియోజకవర్గంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ పరిధి అజయ్‌నగర్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో నూతన డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. .శివారు ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రతి ఒక్కరికీ తాగునీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వర్షపునీరు నిల్వకుండా అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, రామకృష్ణ, విఠల్ రావు, సంపత్ గుప్తా, వెంకటేశ్వర్, వాసుదేవరావు, బాలచంద్ర, రవికుమార్, గజ్జల అశోక్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

వనస్థలిపురం: డివిజన్ పరిధిల్లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. రాజిరెడ్డి నగర్‌లో కొత్తగా మంజూరైన డ్రైనేజీ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే వనస్థలిపురం కాంప్లెక్స్ సమీపంలోని జైహింద్ బాబు కిరాణం రోడ్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ విఘ్నేశ్వరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాలనీవాసులు సంజయ్, శ్రీధర్, విజయ్‌కుమార్, సాయికిరణ్, కిరణ్‌కుమార్, లక్ష్మణ్, స్వర్ణమాధవి పాల్గొన్నారు.

కాలువ పనుల పూర్తికి చర్యలు

హయత్‌నగర్: బండిరేగుల కల్వర్టు నుంచి బంజారా కాలనీ నుంచి ఉన్న వరద కాలువ పనులు అసంపూర్తిగా ఉండడంతో వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, కాలువ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జీహెచ్ఎంసీ ఎస్సీ అశోక్‌రెడ్డితో కలిసి కాలువను పరిశీలించి మాట్లాడారు. కేవలం 20–30 మీటర్ల మేర కాలువ పనులు పూర్తిచేస్తే సమస్య తీరుతుందని వెంటనే అంచనాలను తయారు చేసి పనులు పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట డీఈ కనకయ్య, ఏఈ హేము నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, నాయకులు సత్యనారాయణ, యాదగిరి, బాలు, భరత్ ఉన్నారు.

స్పీకర్‌కు బోనాల ఆహ్వానం

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడలో మహంకాళి మాత ఆలయంలో ఈ నెల 20న నిర్వహించే బోనాల జాతరలో పాల్గొనాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను నిర్వాహకులు మంగళవారం ఆహ్వానపత్రిక అందజేశారు. 4 దశాబ్దాలుగా అత్యంత వైభవంగా బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్‌యాదవ్, రఘునాథ్, ఉత్తమ్ పాల్గొన్నారు.

బోనాల కమిటీ చైర్మన్‌గా సుధీర్



చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ మాదన్నపేట బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్‌గా తంగెళ్ల సుధీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మాదన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధీర్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా బోనాల జాతర ఘనంగా నిర్వహిస్తామన్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీని ఆహ్వానిస్తామన్నారు. మాదన్నపేట బస్తీ పరిధిలో ఉత్సవ ఏర్పాట్లకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మలక్‌పేట: ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేంత వరకు ఉద్యమం ఆగదని పీడీఎస్‌యూ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధ్యక్షుడు మందుల సైదులు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో పోస్టుకార్డు ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రూ. 8 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని కోరుతూ పోస్టుకార్డులు రాసి సీఎం కార్యాలయానికి పంపిచామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలు గాలికొదిలేసిందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వెంటనే స్కాలర్‌షిప్ , ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.